క్లుప్తంగా

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళాలు



మూలపేట గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి విరాళాలు అందించేందుకు పలువురు దాతలు ముందుకొస్తున్నారు. భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం విశాఖ కంచరపాలెం ప్రాంతానికి చెందిన కాండ్రేగుల సూర్యనారాయణ కుమారుడు కస్తూరిరావు, వెంకటలక్ష్మి దంపతులు రూ.10,032 విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.

'కూటమి విజయమే లక్ష్యం'

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి సుందరపు విజయకుమార్‌ను గెలిపించాలని జనసేన మండల ఇన్‌చార్జి జనపరెడ్డి శ్రీనివాసరావు కోరారు. మునగపాక జనసేన కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యలమంచిలి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగరాలని, ఇందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని అన్నారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆడారి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు



వాడ్రాపల్లి జగనన్న కాలనీలో విద్యుత్ సదుపాయం ప్రారంభిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. మండలంలోని వాడ్రాపల్లి జగనన్న కాలనీలో విద్యుత్ సదుపాయం కల్పించి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జోగినాయుడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో పోలీసుల కవాతు



పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించాలనే ఉద్దేశ్యంతో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు కవాతులో పాల్గొన్నాయి. స్థానిక సీఐ బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

మునగపాక: మండలంలోని అరబుపాలెం శివారు పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అరబుపాలెం గ్రామంలో పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.59,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పదమటమ్మ ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

తుమ్మపాల : తమ్మయ్యపేట పదమటమ్మ తల్లి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బోర సోము నాయుడు, ఈశ్వరమ్మ దంపతులు రూ.50 వేలు విరాళం ప్రకటించారు. గర్భగుడి నిర్మాణం నిమిత్తం ఆదివారం రూ. 25 వేలు అందించి తదుపరి మరో రూ.25 వేలు అందించనున్నట్లు తెలిపారు.

'కోడ్' కట్టుదిట్టంగా...

- పక్కాగా ఎన్నికల నియమావళి అమలు
- ఎన్నికల ప్రక్రియ అంతా వీడియో చిత్రీకరణ
- ఆర్వో గీతాంజలి



వివరాలు వెల్లడిస్తున్న ఆర్వో గీతాంజలి



మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధుల పేర్లపై పోస్టర్లు అతికించి మూసివేస్తున్న దృశ్యం

మండలం	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	మహిళలు	మొత్తం
కోటవురట్ల	1-52	21422	22391	43813
పాయకరావుపేట	53-142	39060	39367	78427
నక్కపల్లి	143-217	32095	32486	64581
ఎస్.రాయవరం	218-292	29334	31351	60687
ఇతరులు				02
మొత్తం				247508

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడిన నేపథ్యంలో కోడ్ అమలుకు స్థానిక అధికార యంత్రాంగం చర్యలుచేపట్టింది. ఎన్నికల నియామవళి తక్షణమే అమల్లోకి వచ్చిందని రిటర్నింగ్ అధికారి గీతాంజలి వెల్లడించారు.ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు మే 13న ఎన్నికలు జరగనున్నాయని ఆమె తెలిపారు. గెజిట్ నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వెలువడుతుందన్నారు. నామినేషన్ దాఖలు ఏప్రిల్ 18 నుంచి 25 వరకు ఉంటుందన్నారు. 26న పరిశీలన, నామినేషన్లు ఉపసంహరణ ప్రక్రియ ఏప్రిల్ 29న ఉంటుందన్నారు. జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు.

షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచి ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లేనని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలతో సహా అన్ని చోట్ల రాజకీయ పార్టీ నేతల ఫొటోలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు హోర్డింగ్‌లు వారే స్వచ్ఛందంగా తొలగించాలని, కాని పక్షంలో తమ సిబ్బందితో తొలగించడం జరుగుతుందన్నారు. అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు చేయడానికి వీల్లేదని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమం వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి అమలు చేసేందుకు ప్రతి మండలానికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్, ఎంపీడీవోలు ఎన్నికల కోడ్ అమలయ్యే బాధ్యతలు చూస్తారన్నారు.ప్రభుత్వ కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సామాజిక భవనాలు, దేవాలయాల వద్ద ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే 28 మంది సెక్టోరల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు (పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో మొత్తం 292 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. మొత్తం 2,48,508 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 1,22,353 మంది, మహిళలు 1,26,173 మంది ఉన్నారన్నారు. నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్
- యలమంచిలిలో ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన



మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

యలమంచిలి : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు పాటించేలా ఎన్నికల సిబ్బంది అధికారులు పక్కాగా పర్యవేక్షణ చేపట్టాలని అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ సూచించారు. ఆదివారం సాయంత్రం యలమంచిలి పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, బస్ స్టేషన్, రైల్వేస్టేషన్, ప్రాంతాలు మున్సిపల్ కార్యాలయాలు, వార్డు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళి శనివారం సాయంత్రం నుంచే అమల్లోకి వచ్చిందని ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలని, శిలాఫలకాలు, విగ్రహాలపై ముసుగులు వేయాలని ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ముమ్మరంగా వరి నూర్పులు

రాంబిల్లి : మండలంలో వరి నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అపరాల నూర్పులు జోరుగా జరుగుతున్నాయి. రైతులు ఈ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఖరీఫ్ వరి కోతలు అనంతరం పెసర, మినుము(అపరాలు) పంటలను రైతులు సాగు చేశారు. దీంతో కుప్పలుగా వేసిన వరి చేనును రైతులు నూర్పులు చేస్తున్నారు. ముందుగా సాగు చేసిన రబీ వరి చేను నూర్పు పనులను రైతులు చేస్తున్నారు. నూర్పు పనులకు రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బస్తాకు రూ.300 అదనంగా పలుకుతోంది. గత ఏడాది 75 కేజీల బస్తా ధర రూ.1400 పలకగా ప్రస్తుతం రూ.1700 పలుకుతుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అల్లాడ నాగరాజుకు ఎమ్మెల్యే జోగులు పరామర్శ



అల్లాడ నాగరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం : కుటుంబంలో సమస్యలు వచ్చినప్పుడే ధైర్యంగా ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. పేటసూదిపురం గ్రామంలో ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజును ఆదివారం ఇంటి వద్ద పరామర్శించారు. నాగరాజు ఇటీవల గుండె వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో కంబాల జోగులు స్థానిక నాయకులతో కలిసి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొగ్గు సత్తిబాబు, కోరెడ్డి నాగరాజు, దాసరి నాగేష్, కర్రి సూరిబాబు, యల్లపు నాగు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులు



మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జోగులు

పాయకరావుపేట : పట్టణంలోని ముస్లింల వీధిలో ఆదివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరయ్యారు. మసీదు పెద్దలతో కొంతసేపు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, గ్రామ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మసీదు ప్రెసిడెంట్ జాకులా, మహమ్మద్, రుహుల్లా షరీఫ్, కరీముల్లా, తాజుద్దీన్, సలీమ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి రూ.40 వేల సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం: ఇటీవల సెంట్రింగ్ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు రెండంతస్తుల బిల్డింగ్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడిన నర్సీపట్నానికి చెందిన మర్రా శ్రీహరికి దాతలు సాయం చేశారు. అతడి వెన్నుముక దెబ్బతినడంతో శస్త్రచికిత్స చేయగా, కొన్ని నెలలుగా మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటకు చెందిన అంబేడ్కర్ యూత్ ఏర్పాటు చేసిన మనవాళ్ల కోసం..మనం ఆర్గనైజేషన్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.40 వేలు ఆదివారం అందజేశారు. ఆర్గనైజేషన్ కోశాధికారి దొండా రమేష్ మాట్లాడుతూ బాధితుడితో పరిచయం లేకపోయినప్పటికీ కష్టంలో ఉన్న వ్యక్తిని ఆదుకోవాలనే సంకల్పంతో ఉన్నంతలో ఆర్థిక సాయం చేశామన్నారు. ఆపదలో ఉన్న మనవాళ్లకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు అలమండ మహేశ్వరరావు, నేతల ప్రసాద్, పెలివెల మాలిబాబు పాల్గొన్నారు.

జనసేన నాయకుడిపై మత్స్యకారుల ఆగ్రహం



శివదత్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేటలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: జనసేన పార్టీ నాయకుడు బోడపాటి శివదత్ తమను మోసం చేశాడని, తమ గ్రామ సమీపంలో ఉన్న ఒక రసాయన పరిశ్రమ యాజమాన్యంతో కుమ్మక్కయి తాము చేస్తున్న ఆందోళన విరమింపజేశాడంటూ రాజయ్యపేట గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు ఆదివారం గ్రామంలో ఆందోళన నిర్వహించారు.

గతంలో తాము కంపెనీ వేస్తున్న పైపులైనుకు వ్యతిరేకంగా దాదాపు 700 రోజుల పాటు నిరాహార దీక్ష చేశామని, ఆ సమయంలో మీ డిమాండ్లు , సమస్యలు పరిష్కరిస్తానని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా చెప్పుకుంటున్న బోడపాటి శివదత్ తమ ఆందోళన శిబిరం వద్దకు వచ్చారన్నారు. యాజమాన్యంతో చర్చలు జరిపి మీ డిమాండ్లు పరిష్కరిస్తానంటూ పలుమార్లు తమతోపాటు దీక్ష చేసారన్నారు. శివదత్ మాటలు నమ్మి తామంతా ఆందోళన విరమించామని, అయితే ఆందోళన, దీక్ష విరమించి నాలుగు మాసాలు పైనే అవుతున్నా తమ డిమాండ్లు ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. శివదత్ కంపెనీ వారితో కుమ్మక్కయ్యాడని, వారి వద్ద డబ్బులు తీసుకుని తమను మోసం చేశాడని వారంతా మండి పడ్డారు.

ఈ విషయమై శివదత్‌ను తాము పలుమార్లు ప్రశ్నిస్తే రేపు మాపు అంటూ వాయిదాలు వేస్తూ ముఖం చాటేస్తున్నారన్నారు. శివదత్ మాటలు నమ్మి తామంతా మోసపోయామంటూ పలువురు గ్రామస్తులు, మత్స్యకార యువకులు చేపల గంపలు పట్టుకుని రాజయ్యపేట జంక్షన్‌లో ధర్నా చేశారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పక్షులను కాపాడుకునే బాధ్యత అందరిదీ



కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పక్షులకు ధాన్యపు కుంచెలు ఏర్పాటు చేస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి : వేసవిని దృష్టిలో పెట్టుకుని పక్షులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ వృక్షమిత్ర అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిధిలోని వివిధ దేవాలయాల్లో 58 ధాన్యపుకుంచులు, తాగునీటి మట్టిపాత్రలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పక్షులు అధిక ఉష్ణోగ్రతకు ఇబ్బంది పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, నేటి నుంచి ప్రతి ఇంటిపై పక్షులకు కొద్దిగా తిండి గింజలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. 10 సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో పక్షుల పరిరక్షణకు అనేక కార్యక్రమలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని రకాల పక్షులు అంతరించిపోతున్నాయని, ఉన్న పక్షులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సత్యనారాయణ, విల్లూరి పైడారావు, ఆళ్ల నాగేశ్వరరావు, కె.గణేష్, రాజేష్, బి.వినోద్‌కుమార్, బొడ్డేడ మురళీ, కర్రి హనుమంతరావు, అనిత, నీలవేణి, రంజిత తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నాలుగు కేంద్రాల్లో 768 మంది విద్యార్థులు



యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పది పరీక్షలకు సిద్ధం చేసిన హాలు

మునగపాక : మండలంలో నాలుగు కేంద్రాల్లో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు విలేకరులకు తెలిపారు. మండల వ్యాప్తంగా 6 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, పాటిపల్లి మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మూడు ప్రయివేటు స్కూళ్లకు సంబంధించి 768 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందుకు నాలుగు పరీక్ష కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. నాగులాపల్లి హైస్కూల్లో 128 మంది, గణపర్తి హైస్కూల్లో 176 మంది, మునగపాక హైస్కూల్లో 235 మంది, ప్రగతి పబ్లిక్ స్కూల్లో 229 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆయా కేంద్రాలకు ఉదయం 8.45 గంటలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సదుపాయం, టాయ్‌లెట్స్, బెంచీలు వంటి సదుపాయాలు కల్పించామన్నారు. విద్యార్థులు ఇష్టపడి,కష్టపడి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలలకు పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

రాంబిల్లి : పదో తరగతి పరీక్షలకు మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో ఎం.సూర్యారావు తెలిపారు. రాంబిల్లి, దిమిలి, పంచదార్ల ఉన్నత పాఠశాలలతో పాటు రాంబిల్లిలో రవీంద్ర స్కూల్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. 9 ప్రభుత్వ, 5 ప్రయివేట్ పాఠశాలలకు చెందిన 561 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఎస్.రాయవరం: మండలంలో సోమవారం నుంచి 10 వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ఏఎస్ఎస్ఏఎన్ మూర్తి తెలిపారు. ఎస్.రాయవరం, దార్లపూడి, పి.ధర్మవరం, కొరుప్రోలు, తిమ్మాపురం శ్రీ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది మండలంలో 1067 మంది విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులు కాగా, 57 మంది ప్రయివేటుగా పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో పగడ్బందీగా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమయానికి ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

యలమంచిలి రూరల్ : పదో తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలకు పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో వై.మీనాక్షి తెలిపారు. తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 227, కొత్తపేట హైస్కూల్లో 240, సెయింట్ మేరీస్ స్కూల్లో 220, శ్రీచైతన్య స్కూల్లో 235 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టినట్టు పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షక అధికారులు తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. నో సెల్‌ఫోన్ జోన్‌గా పరీక్ష కేంద్రాలను ప్రకటించారు. పరీక్ష సమయంలో ఏ ఒక్కరూ మొబైల్ ఫోన్ తీసుకెళ్లకూడదని అధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

కమనీయం.. కల్యాణం



స్వామి వారిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: భద్రావతి సమేత శ్రీ భవన్నారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. స్థానిక వేల్పుల వీధి కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం స్థలంలో అనకాపల్లి పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అర్చకులు ఆమంచి ఆంజనేయులు ఈ మహోత్సవాన్ని జరిపించారు. ముందుగా ఉదయం 9 గంటలకు సారె ఊరేగింపు నిర్వహించారు. అనకాపల్లి ముప్పనా సిల్క్స్ నుంచి కల్యాణ వేదిక వరకు స్వామివారి రథంతో ఊరేగింపుగా వచ్చారు. కల్యాణం అనంతరం సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కల్యాణ మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, సంఘం అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వానపల్లి రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యుడు సత్యనారాయణ

మునగపాక: హిందూ. ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యులు ఏలేటి సత్యనారాయణ కోరారు. మునగపాకలోని ఎంఎస్ఆర్ నేషనల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం రాత్రి హిందూ ధర్మ పరిరక్షణలో సమాజ పెద్దల పాత్ర అనే అంశంపై సద్భావన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సమాజాన్ని సమర్థంగా, శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సనాతన సంప్రదాయాలను కొనసాగించేలా మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మేడవరపు జగదీశ్వరరావు, ఐనెల్ల అప్పారావు, కర్రి లక్ష్మీనారాయణ, పిల్లా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ విజయ్‌కుమార్

నక్కపల్లి: ఈనెల 20వ తేదీనుంచి ప్రారంభం కానున్న ఉపమాక వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఆదివారం సీఐ విజయ్‌కుమార్ పరిశీలించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, క్యూకాంప్లెక్స్‌లు, షెడ్లను పరిశీలించారు. దేవస్థానం సిబ్బందితో మాట్లాడారు. ఎంత మంది భక్తులు ఉత్సవాలు తిలకించేందుకు వస్తారో , తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై వారు సీఐకి వివరించారు. ఎదురు సన్నాహం, రథోత్సవం సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను తిరువీధుల్లో ఊరేగిస్తారని, అత్యంత విలువైన ఆభరణాలు ఉండడం వల్ల భద్రత ఏర్పాటు చేయాలని దేవస్థానం సిబ్బంది తెలియజేశారు. అలాగే వాహనాలను ఆలయం వరకు అనుమతించకుండా నక్కపల్లిలోనే పార్కింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. కల్యాణం తిలకించేందుకు సుమారు 50వేల మంది కికిపైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దాదాపు 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నిత్య వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శ్రీనివాసరావు

అనకాపల్లి : నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని, 40 సంవత్సరాలు పైబడి ప్రతి వ్యక్తి ఏడాదికి రెండు సార్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు పొలమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గంట పాటు స్పీడ్ వాకింగ్ చేయడంతో శరీరంలో రక్తప్రసరణ బాగా జరుగుతుందని, వివిధ రకాలైన వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వయస్సును బట్టి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని, రహదారులపై ఫాస్ట్‌ఫుడ్‌లు తీసుకోవడంతో వివిధ రకాలైన వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు వైద్యుడు శ్రీనివాసరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య జాతరకు రాట మహోత్సవం



కొత్త అమావాస్య రాట వేస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి : స్థానిక తాకాశీవీధి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద రాట మహోత్సవాన్ని ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఎన్నికల కోడ్ పాటిస్తు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తాకాశి కన్నబాబు, చందు, వీధి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.